వేదాంతభేరి

ఏప్రిల్ 2021

రూ. 10/-

27-02-2021 మాఘపౌర్ణమి నాడు ఆశ్రమంలో

మృత్యుంజయ హోమము

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 54 ఏప్రిల్ 2021 సంచిక : 04

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 54 ఏప్రిల్ 2021 సంచిక : 04

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. సదుపదేశాలు -శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. శుచిత్వము - శ్రీసద్గురు మలయాళస్వాములవారు - 10
04. అష్టోత్తర శతార్చన - 12
05. శ్రీ స్వాములవారు యజ్ఞేశ్వర స్వరూపులు -
- శ్రీరామకృష్ణానంద స్వాములవారు - 13
06. సాధన పంచకము - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు - 14
06. పరమాత్మ స్థితికి నాలుగు మెట్లు
- శ్రీ సర్వాత్మానందగిరిస్వాములవారు - 18
07. రమణీయ రామాయణం - శ్రీ డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 22
08. భక్తి పరిమళం - ఆచార్య కె. సర్వోత్తమరావు - 27
09. శ్రీమదాంధ్ర భాగవతం - తృతీయ స్కందం
- ఆచార్య డా॥ జక్కంపూడి మునిరత్నం - 30
10. కూర్మావతార రహస్యం ఆర్. శోభాదేవి - 34
11. గీతామకరంద స్వామీ వందనము - కె. ఈశ్వర్ - 35
12. శ్వేతాశ్వతరోపనిషత్తు -ఆచార్య శంకరానందగిరి స్వాములవారు-37
13. ఉద్ధవ గీత - శ్రీ యేలేశ్వరపు హనుమ రామకృష్ణ - 40
14. వార్తలు - 42

ముఖచిత్రం - శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

13.04.2021వ తేది ఉగాది పండుగ 21.04.2021వ తేది శ్రీరామ నవమి
23-04-2021వ తేది శ్రీ మలయాళస్వాములవారి జయన్తి
26-04-2021 శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి ఆరాధన
29-04-2021 శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి 108వ జయన్తి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

01. ఓం గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥

02. ఓం గీతామకరందము సం
ప్రీతిగ పరమార్థ కథలు వెలయించియు వి
ఖ్యాతిని గాంచిన స్వామికి
పూత చరిత్రునకు మా నమోవాకంబుల్

03. ఓం అట్టడుగులోని మనుజునకైన ఇట్టె
యర్థమగునట్లు గీతార్థమంద జేసి
దివ్య సందేశ దీప్తి వాతేనె లొసగి
పూజ లందిన స్వామి! నమోఽస్తు మీకు

04. ఓం బ్రహ్మజ్ఞానానురక్తం వేదోక్త ధర్మాభిషిక్తం
ద్వంద్వాతీతం చ పూతం ఖ్యాతం చ సద్ధర్మకార్యైః ।
భక్తై ర్భక్త్యానుయాతై ర్ధత్తాభి రర్చాభి రిద్ధం
వందే విద్యాప్రకాశానందం చిదానందకందమ్ ॥

05. ఓం మోక్షశ్రీకంఠహారం చాస్తంగతానాత్మభారం
ప్రాప్త శ్రుత్యన్తసారం చాచ్ఛిన్న తత్త్వప్రచారమ్ ।
ధూతాశాపాశబంధం చావిష్కృతాద్వైత గంధం
వందే విద్యాప్రకాశానందం చిదానందకందమ్ ॥

06. ఓం రోచిష్ణుం దివ్యకాన్త్యా చాఢ్యంభవిష్ణుం యశోభిః
భ్రాజిష్ణుం సత్యవార్భిస్తర్జైః కువేదాంతిజిష్ణుమ్ ।
యోగక్షేత్రే చరిష్ణుం వర్ధిష్ణు మాత్మ ప్రభావైః
వందే విద్యాప్రకాశానందం చిదానందకందమ్ ॥

07. ఓం స్మారం స్మారం వచోయస్య ప్రీతిం యాన్తి ముముక్షవః ।
తస్మై విద్యాప్రకాశాయ మునీంద్రాయాస్తు మంగళమ్ ॥

సదుపదేశాలు

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

1. ఉదయమున నాల్గు గంటలకు పడక నుండి లెమ్ము. అది బ్రహ్మ ముహూర్తము. భగవద్ధ్యానమునకు మిక్కిలి అనుకూలమైన సమయము.

2. నీ ఇష్టమున కనుగుణముగ **'ఓం నమోనారాయణాయ' 'ఓం నమశ్శివాయ', ' ఓం నమో భగవతే వాసుదేవాయ' 'ఓం శరవణ భవాయ నమః ' 'ఓం శ్రీరాం జయరాం జయ జయరాం'** అను మంత్రములనుగాని, లేక గాయత్రి మంత్రమును గాని 108 సార్లు గాని, అంతకు అధికముగ గాని జపము చేయుము.

3. ప్రతి నిత్యము నియమబద్ధముగ భగవద్గీత, విష్ణు సహస్రనామము, ఆదిత్య హృదయము, లలితాసహస్రనామము, ఉపనిషత్తులు పారాయణ చేయుము.

4. ప్రతి నిత్యము రామాయణము, భారతము, భాగవతము, యోగవాసిష్ఠములను స్వాధ్యాయము చేసి అందులోని విషయాలపై విచారణ సల్పుము.

5. ప్రతిదినము తప్పక జపము, జపానంతరం ధ్యానము ఒకగంట యైనను చేయుము. ఒకగంట మౌనముగా నుండుము.

6. నీ ఆదాయము ననుసరించి రూపాయకు 5 పైసలు వంతున నిరుపేదలకు, సత్కార్యములకు దానము చేయుము.

7. నీ కోరికలను తగ్గించుకొనుము. తృప్తికరమగు ఆనందమయ జీవితమును గడుపుము. నిరాడంబర జీవితమును గడుపుము. ఉన్నత

భావములను కలిగి యుండుము.

8. శయనించుటకు ముందు నీవు ఆ దినములో చేసిన తప్పులను గుర్తించి ఆత్మ పరిశీలన గావించుకొనుము. గడచిన తప్పులను గూర్చి పశ్చాత్తాప పడుము. కొత్త వానిని చేయకుము.

9. ప్రతిదినము మృత్యువు వేచియున్నదని జ్ఞాపకముంచుకొనుము. సత్ప్రవర్తనను కలిగియుండుము.

10. మనుష్యునకున్న విలువ మనుష్యుని నీడకు లేదు. బింబమునకున్న విలువ ప్రతిబింబమునకు లేదు. అట్లే ఆత్మకున్న విలువ దేహమునకు లేదు.

11. భగవన్నామ జపము, నామసంకీర్తన భక్తిపూర్వకముగ ఆచరించువారికి భక్తిపారవశ్యముచే భగవానుని యనుగ్రహము లభించుటే గాక చిత్తమున్న దైవాణువులచే పరిశుద్ధమగును. జ్ఞాన విచారణచే మోక్షము లభించును.

12. పనిలో దోషము లేదు. పని చేయు విధానంలో దోషము కలదు. కర్తృత్వ బుద్ధియే దోషము. అహంభావమే దోషము. అది లేనప్పుడు కర్మ బంధము కాక మోక్షమునకే సాధనమగును. ఎట్టి పనిని చేయుచున్నాడను ప్రశ్న భగవంతుని యొద్ద ఉదయించదు. ఆ పనిని ఏ ప్రకారం చేయు చున్నాడను ప్రశ్న మాత్రము ఉదయించును. కావున లౌకిక రంగమున గాని, పరమార్థ క్షేత్రమున గాని, జనులు వారి వారి కర్మలనాచరించుకొనుచు అహంభావము లేక, సంగ బుద్ధిని త్యజించి ధర్మనిష్ఠతో, న్యాయబుద్ధితో, భక్తి భావముతో మెలంగినచో అచిరకాలములో భగవత్కృపకు పాత్రులై మోక్ష ధామమును చేరగలరు.

13. ఓ జనులారా! మృత్యువు దూరముగా నున్నదని భ్రమించకుము. అది చేరువలోనే యున్నది. కావున త్వరపడుదు. విజ్ఞానమును సంపాదించుదు.

మఱచిన మీ దివ్య స్వరూపమును తిరిగి జ్ఞప్తికి తెచ్చుకొనుడు. మహాత్ముల నాశ్రయింపుడు. సాధన యొనర్చి కడతేరుడు. బంధము నుండి విడుదల పొందుడు.

14. సత్యము, ధర్మము, ఆత్మపారిశుద్ధ్యమను వాటి ననుష్ఠించుటకు, ఈ మూడింటిని నిరాటంకముగా ప్రపంచమునకు ఉపదేశించుటకును సన్న్యాసమేర్పడినది.

15. దేవుని భజించి జీవుని బాధించినచో ప్రయోజనము లేదు. నారాయణుని పూజించి నరుని దూషించినచో లాభము లేదు. విష్ణువుని ధ్యానించి ధర్మమును ధిక్కరించినచో ఆ ధ్యానమునకు విలువ లేదు.

16. ధ్యానించునపుడు ధ్యేయ వస్తువు తప్ప అన్యమేదియు చిత్తమున ఉదయించకుండు లాగున ప్రయత్నించుడు. ఒకవేళ ఉదయించినను ఆయా దృశ్య వస్తువులను, సంకల్పమున్ను బలాత్కారముగా తొలగింపక, ఉపాస్య దైవమునందే దృష్టిని సంలగ్నపఱచుడు. అప్పుడు వానియంతట అవియే తొలగిపోవును.

17. అమూల్యమగు ఈ జన్మను ఇంద్రియ సౌఖ్యముల కొఱకు ధారపోసి తుదకు శోకసంతప్తులగుట విజ్ఞులకు పాడి గాదు. కావున ఓ సాధకుడా! రేపు, మాపు అనక ఇప్పటి నుండియే పరమాత్మ చింతన కుపక్రమించి బ్రహ్మానంద సామ్రాజ్యాభిషక్తుడవు కమ్ము.

18. నీటిని ఎక్కడ వదలినను క్రిందకు పోవును. నీటిది అధోదృష్టి, నిప్పును ఎక్కడ వెలిగించినను పైకి పోవును. నిప్పుది ఊర్ధ్వ దృష్టి. అగ్నివలె ఊర్ధ్వ దృష్టినే కలిగి యుండుము. కాని జలమువలె అధోదృష్టిని కలిగియుండకుము.

19. దుర్లభమగు మానవ జన్మను బడసియు శాన్తిదాయకమగు దైవపథమును విడచి మనుజుడు విషయోన్ముఖుడై, దుఃఖాకులుడై యుండుట కడుంగడు శోచనీయము. అట్టి వాని జీవితము ముమ్మాటికి నిరర్థకమే యగును. కావున దైవప్రాప్తికై ధ్యానాది కార్యక్రమమును తప్పక ఏర్పాటు చేసుకొనవలెను.

20. ఆధ్యాత్మ పథమున పురోగమనము సల్పు సాధకునకు మూడు సుగుణములు అత్యావశ్యకములై యున్నవి. అవియే పవిత్రత, సహనము, పట్టుదల అనునవి. మహత్తర ప్రయత్నముచే ఈ మూడు సుగుణములను మానవుడు ఎట్లైనను సంపాదించవలయును.

21. యుక్తాహార విహారములచే దేహమును ఆరోగ్యవంతముగను, శక్తిమంతముగను ఉంచుకొని, అందు దాగియున్న పరంజ్యోతిని ధ్యాన విచారణల ద్వారా వీక్షించి, జ్ఞాన నేత్రముచే సందర్శించి తరించవలెను. జీవిత లక్ష్యమిదియే. దేహమను దేవాలయంలో మూలవిరాట్టగు ఆత్మను సందర్శించుటయే జీవితమందలి ప్రధాన కార్యమని జ్ఞపియందుంచుకొని అట్టి మహోన్నతాశయ సిద్ధి కొఱకై అనవరతము ప్రయత్నమాచరించవలెను.

22. దీపజ్యోతి వెలుగవలెనన్న ప్రమిద, తైలము, వత్తి అవసరమైనట్లు జ్ఞానజ్యోతి వెలుగవలెనన్న వైరాగ్యమను ప్రమిద, భక్తియను తైలము, చిత్తైకాగ్రతయను వత్తి అవసరములై యున్నవి.

23. దేనికైన త్రికరణ శుద్ధి అవసరము. శరీరం, మనస్సు, వాక్కు -ఇవే త్రికరణములు. ఇవి పవిత్రంగా వుండవలెను. ఈ మూడింటిని శుద్ధముగా వుంచుకొంటే ఆరోగ్యముండును. ఆరోగ్యవంతులకు ధ్యానము చక్కగా సాగుతుంది.

శుచిత్వము

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

శుచిత్వము బ్రహ్మచర్యవ్రతానికి ముఖ్యాంగముగ తెలిసికొనదగినది. దీనిని పంచశీలము అని కూడా అందురు.

దీనిలో మొదటిది 1. తానుండు స్థలము శుభ్రముగా నుండుట యగును. దానినొక దానిని చూచుకొనిన అచ్చోట నుండువారలు సోమరులా? లేక సోఽహం పరులా? అని గ్రహించుకొనవచ్చును. సో ఽహం పరులైనచో వారు వాసముజేసెడు ప్రదేశమతి నిర్మలముగా నుండును. ఇదియే దానికి గురుతు. దీని నొక దానిని గాంచిన జాలును. మరల అచ్చట నుండు వారిని గురించి ఎక్కువ పరిశోధించబనిలేదు. ఇది బ్రహ్మచారులు నొకరిని గురించి మాత్రము కాదు. యోగులకు, సాధకులందఱికిన్ని సంబంధించినది.

2. ఆత్మశుద్ధి కలిగినవారికి కనిపించిన దంతయు నిర్మలముగ నుండవలయును. 3. చేయు కార్యము కూడ శుద్ధముగా నుండవలయును. లేనిచో వారికి మనశ్శాన్తియు, ప్రసన్నతయు గలుగదు. అదే ప్రకారము 4. ధరించెడు దుస్తులు కూడ అతి నిర్మలముగా నుండవలయును. ఆలాగున తానుపయోగించెడు పాత్రాది వస్తువులన్నియు శుభ్రముగా నుండవలయును. అదేరీతిగా 5. సర్వేశ్వరుండొసగిన ఆహార మేదైనను శుభ్రముగా నుండవలయును. భుజించునప్పుడు నిశ్శబ్దముగాను, నిర్మల భావముతోను నుండవలయును. ధ్యానము చేయు స్థల మేలాగున నిర్మలముగా నుండవలయునని శాస్త్రమందు తెలుపబడినదో అదే విధముగా భోజనము చేసెడు ప్రదేశము కూడ శుభ్రముగా నుండవలయును. అప్పుడే అతని మనస్సు ప్రసన్నత వహించి యుండును.

పైన చెప్పిన యన్నిటికిని మనోనిర్మలత లేనిచో నైజముగా అట్టి స్వభావముండదు. మనస్సు శుభ్రముగా లేనిచో తప, జప, ధ్యాన యోగాదులున్ను, అధ్యయనమున్ను, తపస్సున్ను పూర్ణమగు ఫలము నీయ జాలవు. ఈ విషయములో సాధకులెల్లప్పుడును జాగ్రత్త వహించుకొన వలయును. లోకము మీ కడుపులో ఏమున్నదో దానిని చూడదు. మీరు నివసించెడు స్థలమును, ప్రవర్తనను మాత్రమే చూచునని మీరు జ్ఞాపకములో నుంచుకొనవలయును.

సామాన్యముగా విద్యావంతులు, శ్రీమంతులు నివసించెడు ప్రదేశము, ధరించెడు వస్త్రాదులు చాలవఱకు శుభ్రముగానే యుండును. అదే ప్రకారము వారి యాహారము సాత్త్వికమై యుండిన వారి జీవితము ధన్యము. కళాయి లేని పాత్రయొక్క బాహ్యభాగము శుభ్రపఱచినను దానిలో వండిన పప్పు, పులుసు మొదలైన వెటుల నుపయోగపడవో అట్లే హృదయశుద్ధి లేని వారి యనుష్ఠానములు గూడ సరియగు ఫలము నివ్వజాలవని వారు మరువగూడదు. కావుననే శాస్త్ర మీలాగున చెప్పుచున్నది.

“ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాస్సహ షడ్భిరఙ్గైః ।
ఛన్దాంస్యేనం మృత్యుకాలే త్యజన్తి నీడం శకున్తా ఇవ జాతపక్షాః ॥

నాల్గు వేదములు, వేదాంగములగు వ్యాకరణాదులు అను వాటిని అధ్యయనము చేసినవాడయ్యును, ఆచారహీనుని ఆ వేదములు వేదాంగములు పవిత్రము చేయజాలవు. అంతేగాదు రెక్కలు వచ్చిన పిమ్మట పక్షులు గూటిని వదలిపోవునటుల వేద వేదాఙ్గములన్నియు దేహావసాన సమయమున అతనిని వదలిపోవును. శౌచము ఇరు తెగల నున్నది. బాహ్య శుద్ధి, ఆత్మశుద్ధి అని, మృత్తిక చేతను, జలము చేతను గలది బాహ్యశుద్ధి యనియు, భావశుద్ధి -అన్తరశుద్ధి ఆత్మశుద్ధియనియు తెలియనగును. ఆత్మశుద్ధి లేనివాడు సమస్త తీర్థములలో స్నానమాచరించినను శుద్ధుడు కాజాలడు.

అష్టోత్తర శతార్చన

- శ్రీ విద్యాస్వరూపానన్దగిరి స్వాములవారు

పరమపూజ్య గురుదేవులు, అష్టోత్తరశత (108) గీతాజ్ఞాన యజ్ఞయాజి శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారుగా జన్మించి మనలనుద్ధరించడానికి ఈ లోకంలోనికి ఈ గురు రూపంలో అవతరించి ఈ ప్లవనామ సంవత్సర చైత్ర బహుళ తదియ 29-04-2021 నాటికి 108 సంవత్సరాలయినవి.

మన వైదిక సంప్రదాయంలో 108కి ఒక మహత్తర విలువ వుంది. 108ని 1+0+8= కలిపితే (9) తొమ్మిది వస్తుంది. ఇది పూర్ణ సంఖ్య. కాబట్టే మనం చేసే ప్రతి దైవారాధనలో అష్టోత్తర శతనామార్చనకు ఒక ప్రత్యేకత వచ్చింది.

మనందరినీ గీతాజ్ఞాన గంగలో ముంచి, మనలోని మలదోషాన్ని పోగొట్టి పవిత్రులను చేసిన గురుదేవుల స్థూల శరీరం జన్మించి నేటికి 108 ఏండ్లు. అందుచే ఈ శుభసందర్భంలో మనం గురుదేవుల ఉపదేశాలను ప్రతిరోజు తప్పకుండా కొంతైనా మననం చేసి మనమున్ను భ్రమరకీట న్యాయంతో గురురూపులమవుదముగాక! మన జీవితంలోని మార్పు, శుభ పరిణామం దైవీ సంపదను ఆచరణలో పెట్టడం అనే పుష్పాంజలిని గురుదేవుల పాదపద్మాలకు సమర్పించుదుము గాక !

వందనం గురుదేవాయ గీతాజ్ఞాన ప్రదాయచ ॥
గీతాప్రచారలోలాయ విద్యాప్రకాశ రూపిణే - ఓమ్ -

వేదాన్తభేరికి ఈక్రింది వారు పోషక చందా పంపినారు

01.	యు. దశరథన్ (నాగిళ్ళ)	-	రూ. 2000/-
02.	ఎస్. సురేష్‌కుమార్ (బెంగుళూరు)	-	రూ. 2000/-
03.	కె.వి. రామకృష్ణరావు (హైద్రాబాద్)	-	రూ. 2000/-
04.	డి.జి.ఎస్. నారాయణ (హైద్రాబాద్)	-	రూ. 2000/-

శ్రీస్వాములవారు యజ్ఞేశ్వర స్వరూపులు

- శ్రీరామకృష్ణానంద స్వాములవారు (గండిక్షేత్రం)

(హైద్రాబాద్‌లో 1981లో జరిగిన 100వ గీతాజ్ఞాన యజ్ఞ సందర్భంగా పూజ్యశ్రీ విద్యాప్రకాశానందస్వాములవారిని గురించి పూజ్యశ్రీ రామకృష్ణానంద స్వాములవారు (గండిక్షేత్రం) పంపిన సందేశం).

ఆంధ్రదేశంలో శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారొక అసామాన్య విభూతి. శ్రీమంతులు, శుచిమంతులునైన కుటుంబములో జన్మించిన యోగ పురుషుల వారు. ఆంగ్లభాషలో పట్టభద్రులు, నైష్ఠిక బ్రహ్మచారులు, శ్రీ వ్యాసాశ్రమ సంస్థాపకులగు శ్రీమలయాళస్వాములవారి శిష్యులు.

శ్రీ స్వాములవారు అద్భుతమైన తమ వాగ్ధోరణితో వేలాదిజనులను పరవశులను చేస్తుంటారు. వీరి ఉపన్యాసాలలో సరస ఛలోక్తులు ధారాపాతం లాగా జారి జారి వస్తుంటాయి. శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు తొంబై తొమ్మిది జ్ఞానయజ్ఞాలను జరిపి ప్రస్తుతం నూరవ జ్ఞానయజ్ఞం ఆంధ్ర రాజధానిలో చేస్తున్నారు. హైదరాబాదుకు భాగ్యనగరమనే పేరుంది. ఆ పేరును అక్షరాలా సార్థకం చేసుకొనే సౌభాగ్యం ఆ పట్టణానికి, ఆ పట్టణ ప్రజలకు ఈనాడు ఒదిగి వచ్చింది.

శ్రీ స్వాములవారు "శివాయ లోకస్య భవాయ భూతయే" అని భాగవతం చెప్పినట్లు జ్ఞానయజ్ఞ పరంపరలను "బహుజనహితాయ, బహు జనసుఖాయ" ఆచరిస్తున్నారు. వారి జీవితము యజ్ఞమయము. వారు యజ్ఞేశ్వర స్వరూపులు. వారి యజ్ఞప్రసాదమును ఆరగించి ఆంధ్ర ప్రజలు ధన్యులగుదురుగాక !

దేవుడంటే ఏమిటి? దేవుడు కాని వస్తువులనన్నింటిని వదిలేస్తూ పోతే, ఏది మిగులుతుందో అదే దేవుడు.

సాధన పంచకము

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శీతోష్ణాది విసహ్యతామ్ (గత సంచిక తరువాయి)

శీతము, వేడి, లాభనష్టములు మొదలగు ద్వంద్వములను ఓర్చుకొనవలెను.

శీతాకాలము చలి సహజము. వేసవి కాలము ఉష్ణము స్వభావము. వర్షాకాలము తేమ సహజము. వీటికోసమై ఇవి రాకూడదు అని ఎంత శోకించినను, ఎంతగానో నింద జేసినను అవి రాకుండా వుండవు. వాటిని మనము ఓర్చుకోవాలి. సహించుకొనుట గూడ అలవాటు చేసుకోవాలి. అపుడే శాంతి, సుఖము గలుగును. ఇంతకు పూర్వజన్మలలో చేసిన కర్మ ఫలమే సుఖాది ద్వంద్వములకు కారణము. దీనినే ప్రారబ్దమందురు. ప్రారబ్ద కర్మవశము వలన ప్రాప్తించిన శీతము- ఉష్ణము, సుఖము -దుఃఖము, లాభము -నష్టము, జయము-అపజయము, స్తుతి-నింద, సన్మానము-అవమానము మొదలగు ద్వంద్వములను మానవులమైన మనము ఓర్చుకొనవలెను. శివుడాజ్ఞ లేనిదే చీమ అయినా కుట్టదు యని పెద్దల నానుడి. సుఖ దుఃఖాదులు కలుగుటకు ఎవరి ఆజ్ఞ అని ప్రశ్న వస్తే ఇదీ దైవాజ్ఞ అనే భావించవలెను. ఎందువలన అనగా సృష్టి ప్రారంభములో వేదవిహిత కర్మలు ఆచరించిన వారికి సుఖాదులు కలుగును. వేదనిషిద్ధ కర్మలాచరించు వారికి దుఃఖ నష్టాదులు గలుగును అని జనులందరికి విధాయక నిషేధ శాస్త్రమును పరమాత్మ అందజేసెను. ఆ విధానమును అనుసరించి మనము చేసే కర్మల వలన గలిగే పుణ్య పాపముల ఫలముల వలన సుఖ దుఃఖాది ద్వంద్వములు గలుగును. కావున వీటిని ఓర్చుకొన వలెను. ఈ అనుభవ కాలంలో ఇతరులను నిందించుట మంచిది కాదు.

గీతాచార్యులు కూడ గీత 2వ అధ్యాయంలో 'మాత్రాస్పర్శాస్తుకౌన్తేయ శీతోష్ణ సుఖ దుఃఖదాః ఆగమాపాయినోఽనిత్యాస్తాంస్తితిక్షస్వ భారత। అని ఈవిధంగా చెప్పారు. ఇంద్రియములకు విషయములకు సంబంధ పడినపుడు సుఖ దుఃఖాదులు గలుగును. ఇవి గూడా ఎల్లపుడు ఉండేవి కావు. వస్తూ పోతూ ఉంటాయి. వాటిని ఓర్చుకొనుము. వేరే మార్గం లేదు. ఓర్చుకొనుటయే ఉత్తమ మార్గమని చెప్పిరి.

వివేక చూడామణిలో శ్రీశంకరాచార్యుల వారును ఈ క్రింది విధముగా చెప్పిరి. "సహనం సర్వ దుఃఖానామప్రతీకార పూర్వకమ్ । చింతావిలాపరహితం సాతితిక్షా నిగద్యతే ॥" 'సర్వ దుఃఖానామ్' అన్నపుడు బహువచనము. పిపీలికాది బ్రహ్మ పర్యన్తము అనగా మానవులకు, పశు పక్ష్యాదులైన తిర్యక్ జంతువులకు, చతుర్ముఖ బ్రహ్మ మొదలుకొని సమస్త దేవతలకు గలిగిన దుఃఖాలు మూడు. అవి ఏవనగా -ఆధ్యాత్మిక దుఃఖము, ఆధి భౌతిక దుఃఖము, ఆధి దైవిక దుఃఖము. వీటినే తాపత్రయము అందురు. తాప మనగా దుఃఖము, 'ప్రతికూల వేదనీయః, అని అందురు. వీటిలో ఆధ్యాత్మిక దుఃఖమనగా - 'శారీరకం మానసికం చేతి. ద్వివిధమ్' శారీరక దుఃఖము, మానసిక దుఃఖమని రెండు విధములు. శరీర సంబంధ రోగములు. వాత, పిత్త, కఫ వీటి హెచ్చు తగ్గుల వలన జలుబు, దగ్గు, జ్వరము, నొప్పులు మొదలగునవి వచ్చును.

'ప్రియ వియోగ అప్రియ సంయోగాదిః మానసికం చేతి' మనకు అత్యంత ప్రియమైన (ప్రీతిగల) మనుష్యులుగాని, వస్తువులు గాని దూరమైనపుడు గలుగు దుఃఖమును, మరియు మనకు హానిని గలిగించే శత్రువులు ఎదురుగా వచ్చినపుడు ఇతరులు నిందా వాక్యములు పలికినపుడు, మన మాట ఎవరూ విననపుడు గలుగు దుఃఖమును మానసిక

దుఃఖమందురు. శారీరక దుఃఖము వచ్చినపుడు ఔషదాది సేవనము చేయుచు ఇతరులను నిందించకుండా, ప్రతీకార బుద్ధి లేకుండా ఓర్చుకొనవలెను. మానసిక దుఃఖములు వచ్చినపుడు పూర్వ జన్మలో చేసిన దుష్కృత్యముల వలననే ఎడబాటులు గలిగినవని భావించి, జపధ్యానములు చేసి సత్సంగములు వినుట వలన మానసిక దుఃఖములు పోవును.

ఆధి భౌతిక దుఃఖము -ఇది నాలుగు విధాలుగా ఉంటుంది. జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజ వీటిచే గలుగునవి. జరాయుజ మనగా మనుష్యులు. పశువులు, ఆవులు, గుర్రములు, సింహము మొదలగు మృగములు. అండజములనగా - గ్రుడ్ల నుండి ఉత్పన్నమగునవి. పక్షులు, పాములు, కోళ్ళు మొదలగునవి. స్వేదజములనగా -దోమలు మొదలగునవి, ఉద్భిజములనగా-చెట్లు, రాళ్లు మొదలగునవి వీటిచేత మనకు గలిగిన బాధలను ఆధి భౌతిక దుఃఖములందురు.

ఆధి దైవిక దుఃఖములనగా -"దేవానా మిదం దైవం అథవా దివః ప్రభవతీతిదైవం తదధికృత్య యదుపజాయతే శీతోష్ణ వాత వర్షాఃశని పాతాదికమ్"। దేవతా సంబంధమైనది దైవం అంటారు లేక ఆకాశ సంబంధమైనది గూడ దైవమంటారు. శీతము, ఉష్ణము, తుఫాన్ (అధిక వాయువు) అతివృష్టి, అనావృష్టి, పిడుగులు, భూకంపకములు మొదలగునవి. ఈ మూడు విధములగు దుఃఖములు సంభవించినపుడు వాటియందు ప్రతీకార బుద్ధి లేకుండా, సహనము గలిగియుడవలెను. పూర్వము నష్టము, కష్టము గలిగినవి, ప్రస్తుతం గలిగినవి వీటియందు చింత, విలాపములు లేకుండా ఓర్చుకొనుటను సహనమందురు అని ఆచార్యుల వారు చెప్పిరి. ఈ సహనం గలిగినవాడు సదా శాంతి సుఖములు గలిగియుంటాడు. ఈ సహనం లేకనే ప్రపంచములో తగువులు, తంటాలు ఎక్కువగా నుండును. మనస్సులో

అశాంతి (టెన్షన్) ఉండును. కావున ఏ ఆశ్రమములోనున్న వారికైనా సహనము చాల ముఖ్యమైనది.

నరస్యాభరణం రూపం రూపస్యాభరణం గుణః ।

గుణస్యాభరణం జ్ఞానం జ్ఞానస్యాభరణం క్షమా

మానవుడు మంచి రూపము చేతనే ప్రకాశించును. రూపం లేకుండా ఎన్ని అలంకారములు చేసుకొన్న ప్రకాశించలేదు. రూపముండి బాగుగా కళతో గూడి ప్రకాశముండాలంటే సత్వగుణం గలిగి యుండవలెను. రూపం, గుణం రెండూ శోభాయమానంగా యుండాలంటే యుక్తాయుక్త ధర్మాధర్మ, ఆత్మానాత్మ విచక్షణా జ్ఞానం గలిగి యుండవలెను. ఇటువంటి జ్ఞానముండి గూడా వికాసవంతుడు కావాలంటే చివరకు ఓర్పు గలిగి యుండాలి. అపుడే జ్ఞాని స్థిత ప్రజ్ఞుడై, ఆత్మావలోకనము గలిగియుండును. ఇటువంటి సహనము ఒక సాధనముగా ఆచార్యుల వారు 29వ సాధనలో తెలిపిరి.

ధ్యానమంటే ఏమిటి? దృశ్యాన్ని త్యజించడమే. అన్ని దృశ్యాలను వదలితే చివరకు మిగిలేది ద్రష్టే. అంటే మనమే. అందుకే 'చిదానంద రూపశ్శివోఽహం శివోఽహం అని అన్నారు శ్రీ శంకరాచార్యులవారు.

* * * * *

"ధ్యాన కాలంలో అనుభవానికి వచ్చే సుఖం అనన్తం. అది మాటలతో చెప్పడానికీ, మనస్సుతో భావించడానికీ సాధ్యం కానిది. సముద్రంలో పడిన వడగళ్ళు అందులో లీనమైపోతాయి, కానీ తిరిగిరావు. అలాగే మనస్సు బ్రహ్మంలో లీనమై పోవాలి".

* * * * *

సూర్యరశ్మిలో వెన్న కరుగుతుంది. ఇనుము కరగదు. మనస్సు వెన్నలా వుండాలి. ఇనుములా ఉండరాదు. ఆత్మలో మనస్సులయించడమే మోక్షం.

పరమాత్మస్థితికి నాలుగు మెట్లు

- శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు

"ఆనందో బ్రహ్మ" అని శ్రుతివాక్యము, అంటే ఆనందమే బ్రహ్మ అని అర్థము. బ్రహ్మ అంటే బ్రహ్మ లోకాధిపతి ఐన చతుర్ముఖ బ్రహ్మ కాదు, పరమాత్మ అని ఇక్కడి అర్థము. ఆనందము అందరికీ ఇష్టమైనది, అవసరమైనదే కాబట్టే ప్రపంచములోని ప్రతి జీవి కూడా దాన్ని సంపాదించుకోవడానికి నిరంతరము ప్రయత్నిస్తున్నది.

ప్రపంచంలో లభించే ఆనందము స్వతంత్రమైనదీ, సత్యమైనదీ, శాశ్వతమైనదీ కాదు, అది కేవలము మానసికమైనది మాత్రమే. అది దేశకాల వస్తువుల మీద ఆధారపడినటువంటిది కావటము వలన దానికి స్థిరత్వము లేదు. పరమాత్మ శబ్దముతో చెప్పబడిన ఆనందము మనసుకు సంబంధించినది కాదు. అది దేశకాల వస్తువులకు సంబంధించనిది. అదే ప్రతి ఒక్క జీవి యొక్క స్వరూపము అంటే పరమాత్మ స్థితి. అటువంటి పరమాత్మ స్థితిని చేరడానికి శ్రీమద్భగవద్గీతలో నాలుగు మెట్లు గల మార్గాన్ని భగవానుడు బోధించాడు.

"మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।

మా మేవైష్యసి యుక్త్వైవం ఆత్మానం మత్పరాయణః ॥"

నన్నునింపుకున్న మనస్సు కలవాడివి. నాకు భక్తుడివి. నన్ను పూజించే వాడివి అగుము. నాకు నమస్కరించు. ఈవిధంగా నాతో కూడి యుండి నాకు పరాయణుడివై (నన్ను గమ్యంగా పెట్టుకున్నవాడివై) నన్నే పొందగలవు అని పై శ్లోక తాత్పర్యము -శ్లోకంలో గల శబ్దాలను పరిశీలిద్దాము.

మన్మనా - తన యథార్థ స్వరూప జ్ఞానము లేని వ్యక్తి (జీవి)

లోకంలో సుఖాన్వేషణతో నిరంతరాయంగా జనన మరణ చక్రంలో తిరుగుతూ వుంటాడు. అందుచేత అతడి మనసు ప్రపంచములో లభించే అనేక విధాలైన సుఖ భోగాలకే అలవాటు పడి వాటిమీది కోరికల (వాసనలు)తోనే నిండి వుంటుంది. ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొని తనకు కావలసిన సుఖాల కోసము నిరంతర ప్రయత్నాన్ని చేస్తుంటుంది. ఐతే ఇక్కడి సుఖాలు ఎండమావులలోని నీళ్ళవంటివే గాక అనేకమైన అంతరాయాల (విఘ్నాలు)తో కూడి వుంటాయి. అందుచేత అతడి మనసుకు విశ్రాంతి ఎన్నడూ లభించదు. అజ్ఞాని విషయంలో మనిషి అంటే అతడి మనస్సే గానీ మరొకటి కాదు. కాబట్టి ఈ ప్రయాస నుండి బయటపడాలి అంటే గూడా అతడి మనస్సులోనే మార్పు రావాలి. ఏమిటీ మార్పు? - మనసులో పరమాత్మ తత్త్వాన్ని నింపాలి. పరమాత్మ తత్త్వము అంటే ఏమిటి? - "యతోవా ఇమాని భూతాని జాయంతే యేన జాతాని జీవంతి యత్ప్రయం త్యభి సంవిశంతి తద్విజిజ్ఞాసస్య తత్ బ్రహ్మేతి" అంటే ఈ భుతాలన్నీ ఎవని నుండి పుడుతున్నాయో, పుట్టినవి ఎవడి చేత జీవించ గలుగుతున్నాయో, ఎవనిలో లీనమౌతున్నాయో దాన్ని తెలుసుకో, అదే బ్రహ్మము.

పరమాత్మ అనే ఉపాదానము (ముడిపదార్థము) నుండి ఏర్పడినాయి కాబట్టి సకల జీవులను పరమాత్మగానే గ్రహించడాన్ని మనసు చేత అభ్యాసము చేయించాలి, అన్యభావనను క్రమంగా తొలగించాలి. మన్మనా అన్న శబ్దము దీన్నే సూచిస్తున్నది.

మద్భక్తః -నా భక్తుడు అని అర్థము. లౌకిక వ్యక్తుల పట్ల చూపే అనురాగానికి ప్రేమ అని పేరు. భగవంతుడు, సద్గురువులు, భాగవతోత్తములు ఐన వారి మీద చూపే ప్రేమకు భక్తి అని పేరు. లౌకికుల మీద చూపే ప్రేమ తాత్కాలికమైన సంతోషాన్ని కలిగిస్తుంది. అది గూడా అవతలి వ్యక్తి తన మీద ప్రేమను చూపిస్తేనే. ఏ కారణము చేతనైనా ప్రేమ విఫలమైతే

తీవ్రమైన బాధ లేక జీవితాలను అంతము చేసే పరిస్థితి గూడా సంభవించవచ్చును. కానీ పరమాత్మ మీద చూపే ప్రేమ భక్తుడిని సంసార దుఃఖము నుండి తరింప జేస్తుంది. ఈ విషయంలో ప్రేమ పూర్ణంగా సఫలమవడమే తప్ప విఫలమవడానికి తావు లేదు. నేను పరమాత్మ వాడిని, పరమాత్మ నా వాడు అనే భావంతో భక్తుడుంటాడు. ప్రేమికులకు మాదిరే భక్తుడికి అన్ని సమయాలలోనూ మనసులో పరమాత్మనే మెదులుతుంటాడు. ఇక పరమాత్మ విషయంలో చెప్పే పనే లేదు. ఆయనకు భక్తుడి ధ్యాస తప్ప అన్యమైన దేదీ వుండదు. గజేంద్రుడు, పాండవులు, ద్రౌపది, గోపికలు, ఉద్ధవుడు మొదలైన వారిలో పరమాత్మ యొక్క ప్రేమ స్వభావము వెల్లడి చేయబడింది. ఈవిధంగా పరమాత్మకు భక్తుడు కావడమనేది రెండవ మెట్టు.

మద్యాజీ - ఇది మూడవ మెట్టు - మద్యాజీ అంటే నన్ను పూజించేవాడు అని. పూజించుట అంటే ఆస్తికులందరికీ పరిచయంలో గల షోడశోపచార పూజ. ధ్యాన ఆవాహన ఆసన పాద్య అర్ఘ్య స్నాన వస్త్ర యజ్ఞోపవీత అలంకరణ పుష్పార్చన ధూప దీప నైవేద్య తాంబూల నీరాజన మంత్ర పుష్ప సమర్పణ అన్న వాటిని నిత్యము చెయ్యడము. పరమాత్మ నామరూప రహితుడు గదా! మరి ఆయనను పూజించటము ఎట్లా సంభవము? నామ రూపరహితుడు అంటే ఒకానొక విశేషమైన రూపము మాత్రమే గలవాడు కాడు అని అర్థము. శివ విష్ణు అంబాది అనేక రూపాలలో ఎవరి మనసుకు ఇష్టమైన రూప నామాలను వారు పరమాత్మ భావనతో పూజించుకొనవచ్చును. చరాచర జీవకోటి అంతా పరమాత్మ యొక్క విశేష రూపాలే కాబట్టి పరమాత్మను పూజించడమన్నది అసాధ్యము కాదు. ఇంతేగాక ప్రతినిత్యము నామ సంకీర్తనము, గుణగానము, కథాశ్రవణము, పవళింపుసేవ ఇత్యాదులను చేయవచ్చును. విశేషమైన దినాలలో విశేష పూజ అలంకార నైవేద్యాలను, ఉత్సవాలను జరిపించాలి.

మాం నమస్కురు - నాకు నమస్కరించు - ఇది నాలుగవ మెట్టు పరమాత్మకు ప్రపత్తి చెయ్యాలని అర్థము. ప్రపత్తికి ఆరు అంగాలు. అవి పరమాత్మకు ఇష్టమైన పనులను చెయ్యడము, ఇష్టము కాని పనులను చెయ్యక పోవటము. పరమాత్మ రక్షిస్తాడు, అంటే సంసారాన్ని దాటిస్తాడు. అనే దృఢ విశ్వాసము కలిగి వుండటము, రక్షించమని వేడుకోవడము, లభించిన దంతా పరమాత్మకు అర్పించడము, దీనుడిలాగా వుండటము.

మత్పరాయణః - నన్ను చేరాలనే లక్ష్యంతో జీవిస్తున్న వాడు అని అర్థము. ప్రతి మనిషి తన జీవితంలో ప్రారబ్ధకర్మ ఫలాన్ని తప్పక అనుభవించాలి. "అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్". మరి ప్రారబ్ధ కర్మను అనుభవిస్తున్నవాడు పైన చెప్పబడిన నాలుగు మెట్లను ఏవిధంగా ఎక్కగలడు? ఇదే ప్రశ్నను శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యంలో భూదేవి విష్ణుమూర్తిని అడిగింది. "భగవన్ పరమేశాన భక్తిరవ్యభిచారిణీ ప్రారబ్ధం భుజ్య మానస్య కథం భవతి హే ప్రభో?" అని. దానికి "ప్రారబ్ధం భుజ్యమానోఽపి గీతాభ్యాస రతస్సదా సముక్తస్స సుఖీలోకే కర్మణా నోపలిప్యతే" అని విష్ణుమూర్తి సమాధానాన్ని తెలిపాడు.

ఒక తల్లి తన శిశువును పెంచడానికి మాదిరి పరమాత్మ పరాయణత్వాన్ని సాధించాలి. తల్లి తన భర్త పనులను, అత్త మామల పనులను, వంటపనులను, ఇంటి పనులను, తన పనులను అన్నింటినీ చేసుకుంటూనే శిశువు మీది ధ్యాసలో కాస్తంత గూడా ఏమరుపాటును రానివ్వకుండా వుండి పాలన పోషణలను చేస్తూ దాన్ని పెద్ద చేస్తుంది. అదేవిధంగా విద్యుక్త ధర్మాలన్నింటినీ నిర్వహిస్తూ గూడా పరమాత్మను చేరే లక్ష్యము మీద విస్మృతి లేకుండా జీవితాన్ని కొనసాగించుకోవచ్చును.

అందుచేత ముముక్షువు లందరూ పరమాత్మ ఉపదేశించిన నాలుగు మెట్ల మార్గాన్ని అనుసరించి సంసారము నుండి బయటపడి పరమాత్మ స్థితిని చేరుకొనెదరు గాక. **ఓం తత్ సత్**

రమణీయ రామాయణం

- డా ॥ నముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

(గత నంచిక తరువాయి)

రామాయణాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణం చేసేవారెందరో ఉన్నారు. దానివల్ల అశుభాలు తొలగి శుభాలు కలుగుతాయని వారు విశ్వసిస్తారు.

రామాయణంలో సుందరకాండకు ఒక విశిష్టత ఉన్నది. అందులో కథలో ప్రాధాన్యం వహించినవాడు హనుమంతుడు. అందుకే ఆ కాండను "హనుమద్విజయం" అని కూడా వ్యవహరిస్తారు.

సుందరకాండలోని సౌందర్యం ప్రశస్తం.

సుందరే సుందరో రామః సుందరే సుందరః కపిః ।

సుందరే సుందరీ సీతా సుందరే కిం నసుందరామ్ ॥

అన్నట్లు "సుందరకాండలో రాముడు సుందరుడు, ఆంజనేయుడు సుందరుడు, సీత సుందరి - ఇక ఆ కాండలో సుందరం కానిదేమున్నది?"

ఇటీవల 'కరోనా' మహమ్మారి విజృంభించినప్పుడు లోకక్షేమార్థమై తిరుమల తిరుపతి దేవస్థానం వంటి సంస్థలు భగవద్గీతా పారాయణం తోపాటు సుందరకాండ పారాయణం కూడా చేపట్టి నిర్వహించారు.

యుద్ధకాండలో రావణ వధకు ముందు ప్రస్తావనకు వచ్చే 'ఆదిత్య హృదయ స్తోత్రం' మిక్కిలి ప్రశస్తం. ఆరోగ్యసిద్ధి కొరకు ఆ స్తోత్రాన్ని పారాయణం చేస్తారు. ఇలా ఎన్నో రీతుల రామాయణం మన సాహిత్యంలో ప్రథమ గణనీయమై విరాజల్లుతున్నది.

కావ్య జగత్తులో శృంగారం, హాస్యం, కరుణం, రౌద్రం, వీరం, భయానకం, బీభత్సం, అద్భుతం, శాన్తం - అనే తొమ్మిది రసాలు

ప్రధానంగా ఉంటాయి. రామాయణంలో ఇందు ఏ రసానికి ప్రాధాన్యం? అన్న చర్చ జరిగింది. దీనికి ధ్వన్యాలోకకర్త ఆనందవర్ధనుడు సరి అయిన పరిష్కారం చూపాడు.

కావ్యస్యాత్మా సఏవార్థః తథా చాదికవేఃపురా ।

క్రౌంచద్వంద్వ వియోగోత్థః శోకః శ్లోకత్వ మాగతః ॥

వాచ్య-లక్ష్య-వ్యంగ్యాలని కావ్యార్థాలు మూడు విధాలు. అందులో రసరూపమైన వ్యంగ్యార్థమే కావ్యాత్మగా పరిగణింపబడుతుంది. రసస్ఫూర్తి గల కావ్యం మాత్రమే ఉత్తమోత్తమ కావ్యంగా రూపొందుతుంది.

వాల్మీకి క్రౌంచ పక్షులలో ఒకటి హతం కావడాన్ని, మరొకటి విలపించడాన్నీ చూచి శోకానికి గురి అయ్యాడు. ఆ శోకమే శ్లోకంగా పరిణమించింది. ఆ శ్లోకమే ఇది.

మా నిషాద! ప్రతిష్ఠాం త్వ మగమః శాశ్వతీః సమాః ।

యత్క్రౌంచ మిథునా దేక మవధీః కామమోహతమ్ ॥

కరుణ రసానికి శోకం స్థాయిభావం. ఆ రసమే రామాయణంలో ముఖ్యం. ఆదికవి స్వయంగా శోకమే శ్లోకమైనదని చెప్పి కరుణరస ప్రాధాన్యాన్ని నిర్దేశించాడు. సీతకు రామునితో అత్యంత వియోగం ఏర్పడే వరకూ తన ప్రబంధాన్ని కొనసాగించి కరుణమునే ఆయన కావ్యంలో తుది వరకూ నిర్వహించాడు.

భవభూతి అనే ప్రసిద్ధ నాటకకర్త "ఏకో రసః కరుణ ఏవ" అని యితర రసాల కంటే కరుణ రసానికి గల ప్రాధాన్యాన్ని నొక్కి వక్కాణించాడు.

రాముడు భగవానుని దశావతారాలలో ఏడవ అవతారం. కవి

ఆ అవతారాన్ని ఒక మర్యాదా పురుషోత్తమునిగా చిత్రించాడు. లోకంలో గూడా గరిష్ఠుడైన మహోన్నత వ్యక్తి ఎవరు? అన్న వాల్మీకి ప్రశ్నకు నారద మునీంద్రుడు "త్రై ర్యుక్తం శ్రూయతాం నరః' అని చెప్పి ఆ గుణాలు గల ఉత్తమ మనుజునిగానే శ్రీరాముని పేర్కొన్నాడు.

ఆదర్శ పిత, ఆదర్శ మాత, ఆదర్శ భ్రాత, ఆదర్శ పత్ని, ఆదర్శ పతి- ఇలా ఎట్టి ఆదర్శంతో గృహస్థులు మెలగాలో అట్టి పవిత్రమైన ఆదర్శాన్ని సీతారామాది పాత్రల ద్వారా కవి లోకానికుపదేశించాడు.

శ్రీరాముని సోదర ప్రేమ ఎలాంటిదో కవి నిరూపించిన విధానం పరిశీలించండి! లక్ష్మణుడు శక్తి ప్రయోగానికి గురి అయినప్పుడు "రాముడు"ఏ దేశంలోనైనా కళత్రాలు లభిస్తారు. వారితోపాటు బంధువులు దొరుకుతారు. కాని తోడబుట్టిన సోదరుడు లేకుండాపోయే దుఃస్థితి సంభవిస్తే ఆ లోటును తీర్చే మరొక సోదరుడు ఏ దేశంలో లభిస్తాడు"? అని విలపిస్తాడు.

దేశే దేశే కళత్రాణి దేశే దేశే చ బాంధవాః ।

తం తు దేశం న పశ్యామి యత్ర భ్రాతా సహోదరః ॥ (5-15-48)

ప్రపంచ వాఙ్మయంలో ఇట్టి ఇదాత్త భావాలు కల సాహిత్యం ఎక్కడ లభిస్తుంది?

అయితే రామలక్ష్మణాదుల సౌభ్రాత్రం ఆ కాలంలో అందరు సోదరులలోనూ ఉండేదని భావించలేము. లోకరీతిని కవులు తమ కావ్యాలలో వర్ణిస్తారు. రావణ - కుంభకర్ణ- విభీషణులు గూడ సోదరులే. కాని వారి మనస్తత్వాలలో ఎంత తేడా ఉన్నదో గమనార్హం. దాన్ని గూడా వాల్మీకి చక్కగా వర్ణించాడు.

ఇక వాలి సుగ్రీవుల సౌభ్రాత్ర మెలాంటిదో రామాయణ పాఠకులందరూ ఎరిగినదే. దశరథ పుత్రులకు రాజ్యకాంక్ష లేదు. భరతుడు తల్లి పొందిన వరం వల్ల లభించిన రాజ్యం సైతం వద్దన్నాడు. రాముడు గూడా రాజ్యాధిపత్యానికి సిద్ధపడలేదు. లక్ష్మణుడు సుఖాసక్తి వదలి అన్నతో కూడా అడవుల పాలయ్యాడు. ఇది రామాదుల సౌభ్రాత్రం.

ఇక వాలి సుగ్రీవుల సంబంధం ఇందుకు పూర్తిగా విరుద్ధం. వాలి మరణించాడని నిర్ధారణ కాకముందే సుగ్రీవుడు కిష్కింధను చేజిక్కించుకొంటాడు. వాలి వచ్చి అతణ్ణి రాజ్యం నుండి తరిమివేస్తాడు. దురాశోపహతులైన వీరి చరిత్ర ఇట్టిది.

వాలి సుగ్రీవుల వృత్తాంతంలో గమనింపదగిన సత్యం ఒకటి ఉన్నది. తన పరాక్రమంపై దృఢ విశ్వాసంతో తిరుగులేని రాజుననుకొన్న వాలి ఒకే ఒక్క రామబాణంతో నేలకూలాడు. అట్లే ఋష్యమూకంలో తప్ప తనకెక్కడా చోటులేదనుకొన్న సుగ్రీవుడు కిష్కింధకు పరిపాలకుడయ్యాడు. కలిమి లేములు చక్రనేమి క్రమంతో దొర్లిపోతుంటాయనడానికి ఇదొక చక్కని నిదర్శనం.

గీతలో మూడు నరక ద్వారాలు పేర్కొనబడ్డాయి.

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశన మాత్మనః ।

కామః క్రోధస్తథా లోభస్తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥

వాలి వినాశానికి అతని కామక్రోధాలే కారణమయ్యాయి. సోదర భార్యా హరణం అతని ధర్మవిరుద్ధ కామానికీ, రాజ్యంలో సుగ్రీవునికి చోటివ్వకపోవడం లోభానికీ, సోదరునితో ఎడతెగని శత్రుత్వం మితిమీరిన క్రోధానికీ నిదర్శనాలు. చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థకామమోక్షాలలో

నాలుగవ పురుషార్థం మన జీవితానికి పరమ ప్రయోజనం. దాన్ని సాధించడానికి కర్మ-భక్తి-ధ్యాన- జ్ఞానయోగాలను సాధనాలుగా శాస్త్రాలు పేర్కొన్నాయి. అందులోనూ ముఖ్యంగా భక్తి యోగం సులభమైన తరణోపాయంగా కీర్తితమయింది.

భక్తి కంటే గూడా ప్రపత్తి (శరణాగతి) అత్యంత సులభమార్గమని వైష్ణవాచార్యుల మాట.

'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అని గీతాసూక్తి.

నిన్ను నమ్మి విశ్వాసము. నీపై నిలుపుకొని ఉన్నవాడ నిక వేరే - ఉపాయమేమిటికి? అని అన్నమయ్య ప్రపత్తి ప్రాముఖ్యాన్ని కీర్తించాడు. రామాయణాన్ని 'శరణాగతి శాస్త్ర'మని కూడా వ్యవహరిస్తారు. జటాయువు, సుగ్రీవుడు, విభీషణుడు మున్నగు భక్తులు భగవంతునికి శరణాగతులై రక్షణ పొందారు.

భగవంతుని ప్రపన్న రక్షకత్వాన్ని రామాయణం అతి నిపుణంగా అభివర్ణించింది.

సకృదేవ ప్రపన్నాయ తవాస్మితి చ యాచతే ।
అభయం సర్వ భూతేభ్యో దదామ్యేత ద్వ్రతం మమ ॥ (6-18-33) అని ఒక్కసారి తనకు శరణాగతులైన వారికి తాను అభయమిచ్చి కాపాడ తానని, అది తన వ్రతమనీ రాముడు చెప్పాడు. కాన రామునికి శరణా గతులమై రక్షణ పొందుదుము గాక!! రామాయణాన్ని శ్రద్ధతో పఠింతుము గాక !

ఉగాది శుభాకాంక్షలు

వేదాన్తభేరి పాఠకులకు, రచయితలకు, పోషకులకు, లోకంలోని సర్వప్రాణులకు ఉగాది శుభాకాంక్షలు.

భక్తి పరిమళం

రచయిత - ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

'భక్తి' వలన కలిగే లాభాలు : భగవద్గీలో భగవంతుడు తన్ను కొలిచేవారు నాల్గు రకాల వారన్నాడు. మొదటివాడు ఆర్తుడు -కష్టాలలోమునిగి దీనుడయినవాడు. రెండవవాడు జిజ్ఞాసువు -తత్త్వజ్ఞానం తెలుసుకోవాలను కొనేవాడు. మూడవవాడు అర్థార్థి- డబ్బుకు సంబంధించిన ప్రాపంచిక విషయాలను ఆపేక్షించేవాడు. నాల్గవవాడు జ్ఞాని తత్త్వాన్ని తెలుసుకొన్నవాడు. ఈ భరోసా ఉండడం వల్ల సామాన్యులు కూడా తమ తమ ప్రయోజనార్థం భగవానుణ్ణి సేవించవచ్చు.

మూడు కాలాలలోను సత్యస్వరూపమయిన భక్తి సర్వశ్రేష్ఠం. దీనినే హర్నానంద గారు త్రికాల సత్యస్య భగవతః భక్తిరేవ గరీయసీ అన్నారు. సత్యస్య కర్మాది యోగత్రయస్య మధ్యే భక్తిరేవ గరీయసీ. సత్యానికి మార్గాలయిన కర్మాది యోగత్రయంలో భక్తికే ఆధిక్యం. సత్యసాక్షాత్కార మార్గాలయిన కర్మ, జ్ఞాన, భక్తి మార్గాలలో భక్తిమార్గం అత్యుత్తమం. కనుకనే భక్తి వినా బ్రహ్మజ్ఞానం కదాఽపి న జాయతే. భక్తి లేకపోతే బ్రహ్మజ్ఞానం ఉదయించదు. భక్త్యా సర్వసిద్ధయః సిద్ధ్యంతి, భక్తి వలన సర్వం సిద్ధిస్తుంది. భక్త్యా అసాధ్యం న కించిదస్తి. భక్తిచే సాధింపలేనిది ఏది లేదు - ఇవన్నీ సత్యాలనడానికి మహాభక్తుల చరిత్రలే సాక్ష్యాలు.

భక్తి ప్రధాన భేదాలు: భక్తి రెండురకాలు-పరాభక్తి, అపరాభక్తి. ఈశ్వర సాక్షాత్కారమయ్యాక అభివ్యక్తమయ్యే పరమానందం పరాభక్తి. ఇది అమృతంలాంటిది. ఈ అమృత సేవనం చేసిన వారికి ముక్తి తథ్యం. దీనిని పరమప్రేమ అంటారు.

పరాభక్తి లక్ష్యం : అపరాభక్తి లక్ష్యసాధనం. ఇది రెండు రకాలు. గౌణభక్తి, ముఖ్యభక్తి అని. గౌణభక్తి సులభం. భగవద్గుణ కీర్తన, మాహాత్మ్య శ్రవణాసక్తి, పూజాదుల పట్ల ప్రీతి తాను దాసుడనడం లాంటివి గౌణభక్తిలో సహజం.

ముఖ్య భక్తికి దారి గౌణభక్తి. దీనికి ఏకాంతభక్తి అని పేరు. మూగవాడు రుచికరమయిన ఆహారాన్ని స్వీకరించి, ఆ ఆహారం రుచి చెప్పలేనట్లు అవ్యక్తమయింది. ఇది క్రమంగా పరాభక్తికి దారితీస్తుంది. ఈ భక్తి మార్గంలో పయనించేవాడు దేనినీ కోరడు. ఎవరినీ ద్వేషించడు. సదా పరవశుడయి ఉంటాడు. సదా పరమేశ్వర స్మరణలో కాలం గడపుతాడు.

ప్రాపంచిక జీవనంలో 'భక్తి'- కొందరు భక్తులు కంచికామకోటి పీఠాధిపతులతో ఈ కలియుగంలో భక్తి పెరిగిందని అన్నారట. స్వామి నవ్వి, కాసేపు తరువాత భక్తి పెరగలేదు, 'భయం' పెరిగిందన్నారట. గతకాలంలో గృహ సమస్యలు గృహయజమాని తీర్చేవాడు. వీధి పెద్ద వీధిలోని వారి ఇబ్బందులకు పరిహారం చేసేవారు. అలాగే నగరాధిపతి తన ధర్మం నెరవేర్చేవాడు. కాని ఈనాడు పరస్పర విశ్వాసం సడలింది. ఎవరికీ ఏదీ కాబట్టదు. అకారణంగా గండిపడిన చెరువు నీళ్ళలాగా అన్ని సమస్యలు దేవాలయాల మీద పడుతున్నాయని చెప్పారు. అయినా ఈ కారణంగా గతంలో కంటె ఆలయ సందర్శనం పెరిగిందనడం వాస్తవం.

ఈ రోజులలో ఏ వృత్తివారిలో కూడా శాంతి, సౌఖ్యం లేదు. కౌటుంబికమయిన బాధలు పెరిగిపోతున్నాయి. వీటికి నివారణోపాయం అగమ్యంగా కనిపిస్తుంది. ఇలాంటి వారికి తాత్కాలిక వైద్యసేవనం చేత రోగాలు నయమయినట్లుగాక **భక్త్యౌషధంతో** ఎంతో నిమ్మళం

చేకూరుతుంది. శాంతి సౌఖ్యాలు సమకూరుతాయి. సమస్యలకు పరిహారాలు స్ఫురిస్తాయి. కౌటుంబిక జీవనం ఒక ఆదర్శమార్గంలో నడపడానికి వీలుంటుంది. లేకపోతే కుటుంబం లోనివారు బైపాస్‌లో వెళ్ళిపోయేవారవుతారు. అందుకే త్యాగయ్య **చక్కని రాచమార్గముండగ సందుల దూరనేల'** అన్నాడు.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్

అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్

ఇవన్నీ పారమార్థిక జీవనానికే అని అనుకోవడం సబబు కాదు.

కౌటుంబిక జీవితంలో 'శ్రవణం-అవసరం. తండ్రి చెబితే సంతానం వినడం. భార్య చెబితే భర్త వినడం. ఆలాగే భర్త చెప్పిన మార్గాలలో భార్య నడవడం లాంటివి ప్రశాంత కౌటుంబిక జీవితానికి దోహదం చేసేవి. అలాగే వృత్తులలో పై అధికారి చెప్పిన వాటిని సేవకుడు విని ఆచరించకపోతే అన్నీ అస్తవ్యస్తమవుతాయి.

నిత్య జీవితంలోను స్మరణం అవసరం. గతానుభవాల స్మరణానుభవం కాలోచిత నిర్ణయాలకు తోడ్పడుతుంది. 'మననం' తానెంచుకున్న మార్గంలోని మంచిచెడ్డలను బేరీజు చేస్తుంది. ఇలాగే వందనం, సఖ్యం అనేవి సామాజిక జీవితానికి చాల అవసరమైనవే. ఇవన్నీ పారమార్థిక మార్గంలో మానవుని జీవితానికి తోడ్పడుతాయి. దైవచింతన ఇచ్చే శాంతి మరే దానికి లభించదు.

ఎచట మైత్రియుండునో దానిని వృద్ధి చేయుము
ఎచట విరోధముండునో దానిని తొలగించుము
ఎచట అపవిత్రత యుండునో దానిని తరిమివేయుము
ఎచట దైవత్వముండునో దానిని స్వీకరించుము
- శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శ్రీమదాంధ్ర భాగవతం – తృతీయ స్కంధం

వచనానువాదం

(గత సంచిక తరువాయి) – ఆచార్య డా॥ జక్కంపూడి మునిరత్నం

శక్తిసామర్థ్యాలున్నప్పటికీ అవతార పురుషుడైనప్పటికీ కృష్ణుడు కంసుడు హింసిస్తాడని వ్రేపల్లెలో దాక్కున్నాడు. జరాసంధుడు దుష్ట పరివారంతో ముట్టడించినప్పుడు మధురను కూడా విడిచి వెళ్ళిపోయాడు. వీటిని తలుచుకుంటే ఇప్పటికీ నాకు దుఃఖం కలుగుతుంది. కంసుణ్ణి సంహరించి దేవకీ వసుదేవుల దగ్గరికి వెళ్ళినప్పుడు “తల్లిదండ్రులారా! నేను మీకు కుమారుణ్ణై వుండి కూడా కంసుణ్ణి కడతేర్చకుండా ఇంతవరకు ఉపేక్షించాను. ఇందుకు నన్ను క్షమించండి”. అని వారికి విన్నవించాడు. అప్పటి ఆయన మధుర భాషణలు మదిలో మెదులుతూ ఉంటే నా ఎద బాధతో బరువెక్కిపోతూ ఉంది. పుట్టినప్పటి నుండి కీడు చేయడానికి అలవాటుపడిన శిశుపాలుడు చివరికి పరమపద మందుకున్నాడు కదా! కురుక్షేత్ర సంగ్రామంలో కృష్ణ ముఖారవిందాన్ని దర్శిస్తూ మరణించిన శత్రురాజులు కూడా మోక్షాన్ని పొందారు కదా! కృష్ణుడి గొప్పతనానికి ఇంతకు మించి ఉదాహరణ ఏదైనా ఉంటుందా?

త్రిమూర్తులకు అధినాథుడైన పరమేశ్వరుడు కృష్ణుడై కంసుణ్ణి హతమార్చాడు. ఉగ్రసేనుడికి పట్టం గట్టి అతని ఆజ్ఞలను శిరసా వహించాడు. ఇది తలచుకుంటే నా మనసుకు సంతాపం కలుగుతుంది. స్తనాలలో విషం నింపుకొని చంప వచ్చిన పూతనకు కూడా శ్రీకృష్ణుడు మోక్షాన్నే ప్రసాదించాడు. స్తన్యమిచ్చి పెంచిన యశోదకు కూడా అందని పరమపదాన్ని ఆ రాక్షసికి అనుగ్రహించాడు. అలాంటి దయామయుడు నిరంతరమూ తన పాదాలను ధ్యానిస్తూ గడిపేవారిని సేవించడంలో

ఆశ్చర్యమేముంటుంది.”

ఉద్ధవుడి మాటలు విదురుడి ఉల్లాస్ని పల్లవింప జేశాయి. దయామయుడైన శ్రీహరి తన అనుచరులకిచ్చే పరమపదాన్ని క్రూరులైన రాక్షసులకు కూడా ఎలా ఇచ్చాడో తెలియజేయుమని కోరాడు. ఉద్ధవుడు చెప్పసాగాడు.

“విదురా! రాక్షసులెందరో శ్రీమన్నారాయణుణ్ణి రణరంగంలో ఎదుర్కొన్నారు. ధిక్కార పూర్వకంగా అతని నామాన్నే ఉచ్చరిస్తూ, అతని ముఖారవిందాన్నే చూస్తూ ప్రాణాలు విడిచారు. పరమపదాన్ని పొందారు. సుందర వదనారవిందుడైన ఆ నందనందనుడి జన్మ వృత్తాంతాన్ని నీకు వివరిస్తాను. ఏకాగ్రచిత్తంతో విను. బ్రహ్మదేవుడి మొరను ఆలకించి భూభారాన్ని తగ్గించేందుకు కృష్ణుడు జన్మించాడు. కంసుడు హింసిస్తాడనే సంశయంతో వసుదేవుడు ఆ బిడ్డను రేపల్లెకు చేర్చాడు. నందుని భార్య యశోద పక్కన పడుకోబెట్టి తిరిగి వచ్చాడు. కృష్ణుడు నందనందనుడుగా పెరిగాడు. అన్న బలరాముడితోనూ, అక్కడి పిల్లలతోనూ కలిసి ఆడుకోసాగాడు.

పదకొండేళ్ళు గడిచినా కృష్ణుడు హరి అవతారమని ఎవరూ గుర్తించలేదు. బాలకృష్ణుడు ఆవుల్ని మేపుతూ గడిపాడు. యమునానదీ తీరంలో అనేక రకాల పొదరిళ్ళలో అనేక రకాల శబ్దాలు చేస్తూ తోటి పిల్లల్ని ఆటపట్టించేవాడు. పిల్లనగ్రోవి ఊదుతూ అందరినీ మైమరపించేవాడు. కంసుడు పంపిన రాక్షసులనెందరినో కడతేర్చాడు. యమునానదిలో నివసిస్తున్న కాళీయ సర్పాన్ని అక్కడ నుంచి తరిమివేశాడు. దానితో యాదవులు, గోవులు ఆ నదిలో ప్రవేశించేందుకు అవకాశం ఏర్పడింది.

కృష్ణుడు దేవేంద్రుడి అహంకారాన్ని పోగొట్టాలనుకున్నాడు.

యాదవులు ఆనవాయితీగా చేసే ఇంద్రోత్సవాన్ని మాన్పించాడు. తక్కువ ఖర్చుతో గోపూజా ప్రధానమైన గో యాగాన్ని నిర్వహింపజేశాడు. ఇంద్రుడికి కోపం వచ్చింది. గోకులం మీదికి 'వలాహకం' మొదలైన మబ్బులను పంపించాడు. అవి గర్జిస్తూ వచ్చాయి. గోకులంలోని వారికి భీతి కలిగేలా రాళ్ళవర్షం కురిసేట్టు చేశాయి. గోపాలురు హాహాకారాలు చేశారు. కృష్ణుడు వారి ప్రార్థన మన్నించాడు. గోవర్ధన పర్వతాన్ని పైకెత్తి గొడుగుగా పట్టాడు.

శరత్కాల పౌర్ణమి రాత్రి వేణుగానం చేశాడు. ఎవరు వారించినా వినకుండా బృందావనంలోని గోపికలందరూ కృష్ణుణ్ణి చేరుకున్నారు. ఆయన వారితో కలిసి నాట్యం చేసి ఆనందింపజేశాడు.

కృష్ణుడు మధురకు వెళ్ళి కంసుణ్ణి హతమార్చాడు. తల్లిదండ్రులను బంధవిముక్తుల్ని చేశాడు. సకలలోక గురువైనప్పటికీ సాందీపని గురుకులానికి వెళ్ళి విద్యలభ్యసించాడు. వేదాన్నీ, అరవై నాలుగు కళలనూ అభ్యసించాడు. అతి తక్కువ వ్యవధిలోనే వాటిని నేర్చుకున్నాడు. ప్రభాస తీర్థంలో స్నానం చేస్తూ మరణించిన గురుపుత్రుణ్ణి తిరిగి తెచ్చి ఇచ్చి గురుదక్షిణ చెల్లించుకున్నాడు.

గోవిందుడు విదర్భ దేశానికి వెళ్ళాడు. స్వయంవరానికి వచ్చిన రాజులందరినీ ఓడించాడు. రుక్మిణీ దేవిని పెళ్ళాడాడు మదించిన ఏడు ఆబోతులను లొంగదీసుకొని స్వయంవరంలో నాగ్నజితిని చేపట్టాడు. సత్యభామ కోర్కె తీర్చేందుకు స్వర్గానికి వెళ్లాడు. దేవేంద్రుణ్ణి జయించి పారిజాత వృక్షాన్ని ద్వారకకు తెచ్చాడు. నరకాసురుణ్ణి 'సునాభము' అనే చక్రంతో వధించాడు. భూదేవి కోరిక మేరకు నరకుడి కుమారుడికి అతని రాజ్యాన్ని అప్పగించాడు. నరకాసురుడి చెరలో ఉన్న పదహారువేల నూరుగురు కన్యలను విడిపించాడు. వారందరినీ పెండ్లాడాడు. అందరికీ అన్ని రూపులై వారిని అలరించాడు. శ్రీకృష్ణుడు ప్రతి భార్యకు తనతో

సాటి వచ్చే కుమారులు పదుగురిని ప్రసాదించాడు.

కాలస్వరూపుడైన ఆ మహానుభావుడు కాలయవన సాల్వులను కడతేర్చాడు. జరాసంధుణ్ణి వధింపజేశాడు. భీమార్జునులకు విజయ పరంపర చేకూర్చి పెట్టాడు. బలరామ సహితుడై శంబరుడు, మురుడు, పల్వలుడు మొదలైన రాక్షస నాయకుల్ని ససైన్యంగా సంహరించాడు. ఎదిరించిన దంతవక్త్రుణ్ణి అంతం చేశాడు. భారత యుద్ధంలో పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యాన్ని సమయింపజేశాడు. యాదవులు పరస్పరం కలహించుకొని మరణించేలాచేశాడు. తద్వారా భూభారాన్ని తొలగించాడు.

ధర్మ పక్షపాతియైన ఆ దేవకీ నందనుడు ధర్మనందనుణ్ణి రాజుగా చేశాడు. ఆయన చేత మూడు అశ్వమేధ యాగాలు చేయించాడు. అశ్వత్థామ బాణాన్ని అడ్డుకొని ఉత్తర గర్భస్థుడైన శిశువును రక్షించాడు.

"త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు (కంటి ఆసుపత్రి)
ఈ క్రిందివారు పైకం పంపినారు

1). ఎ.సరస్వతి (కర్నూలు) - రూ.50,000/-
2). శ్రీ సీతారామ సేవాసదన్ (మంథని) - రూ.25000/-
3). ఎ.వి. నాగేశ్ ఛారిటబుల్ ట్రస్టు (బెంగుళూరు)- రూ.15000/-
4). డి. బాలకృష్ణారెడ్డి (సూళ్ళూరుపేట) (ఒక లక్ష) - రూ.1,00,000/-
5). సి.ఎస్.ఆర్.వి. ప్రసాద్ (విజయవాడ) - రూ.10116/-

సద్గురు సర్వ సేవా ట్రస్టుకు ఈ క్రిందివారు పైకం పంపినారు

1). పి. ప్రమీలాదేవి (హైద్రాబాద్) అన్నదానానికి - రూ.2,00,000/-
2). డా.॥ జి.వి. ప్రభాకర్ (తిరుపతి) - రూ. 20,000/-
3). మణికిశోర్ (కుప్పారెడ్డి పాళెం) - రూ. 20 050/-
4). డి.భారతి (సూళ్ళూరుపేట) - రూ. 50,000/-

కూర్మావతార రహస్యం

(2021 జనవరి సంచిక తరువాయి) **- ఆర్. శోభాదేవి**

ఆధ్యాత్మిక భావం : దేవత లెవరు? రాక్షసులెవరు? వాళ్ళకు తగాదాలు ఎందుకు వచ్చాయి. శ్రీహరి దేవతలనే ఎందుకు సమర్థించాడు? అనేక సందేహాలు. పరమాత్మ సర్వాంతర్యామి పంచభూతాత్మకమైన శరీరంలో భూస్పర్శ వలన అజ్ఞానం చోటు చేసుకుంటుంది. సత్వరజస్తమో గుణాల కలయికలలో తేడాల వల్ల మనిషి మనిషికి తేడా వుంటుంది. సద్గుణాలను దైవీ గుణాలనీ, దుర్గుణాలను రాక్షస గుణాలనీ అంటారు. మానవునిలో మంచి చెడుల పోరాటం జరుగుతుంటుంది.

సాధకుని మనస్సే పాలకడలి. తదేక ధ్యానం అనే మందర పర్వంతో మనస్సును మథించాలి. నిలకడ కుదరదు. పరమాత్మ అనుగ్రహం కావాలి. అదే పరమాత్మ కూర్మావతారం ధరించి పర్వతాన్ని కుదురుగా నిలబెట్టడం. తానే దేవతలలో, రాక్షసులలో, వాసుకిలో ప్రవేశించి అమృతాన్ని సాధించడంలో సహాయపడ్డాడు.

ఆకలిదప్పులు, ఆశామోహాలు, శోక మరణాలను నిగ్రహించి ధ్యానంతో మనస్సును మథించగా అంతర్లీనంగా వున్న దోషాలు లోపల వుండలేక బయటికి వస్తాయి. అదే మొదట వచ్చిన హాలాహలం.

వాసుకి అంటే పాము (కుండలిని). వెన్నుపాములో సుషుమ్నా నాడికి ఇరువైపులా ఇడ పింగళ నాడులు వుంటాయి. సాధన ద్వారా సాధకుడు మూలాధారంలో చుట్ట చుట్టుకొని నిద్రిస్తున్న కుండలినిని మేల్కొలిపి స్వాధిష్ఠానం, మణిపూరం, అనాహతం, విశుద్ధం ఆజ్ఞా చక్రాలను దాటి సహస్రారం చేరుకుంటాడు. చక్రాలను దాటేటప్పుడు సిద్ధులు లభిస్తాయి. అలాంటివే కామధేనువు, ఉచ్చైశ్రవము, ఐరావతము, కల్పవృక్షము, అప్సరసలు, శ్రీదేవి తదితరాలు. లభించిన సిద్ధుల దగ్గర ఆగకుండా సాధకుడు సహస్రారం చేరుకొని అమృతానంద ధారలను పానం చేయటమే గాక తడిసి ముద్దై ఆనంద డోలికల్లో తేలియాడుతాడు. రాక్షసులు వారుణిని గ్రహించారు. జగన్మోహినిని మోహించి సాఫల్యం పొందలేకపోయారు. కుండలినీ ఉద్బోధనే కూర్మసాధన. **ఇదే కూర్మావతార రహస్యం.**

గీతామకరంద స్వామీ వందనము

- కె. ఈశ్వర్

భగవద్గీత పేరు వినగానే గుర్తుకు వచ్చేది గురుదేవులైన శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారే. భగవద్గీత కొన్ని వర్ణముల వారికే పరిమితమనియు, మరికొందరు తాకరాదనియు, చదవకూడదనియు సంకుచిత భావాలతో వున్న సమయములో జాతి, మత, కుల భేదము లేకుండా అందరూ చదువవచ్చు. గాలి పీల్చుటకు జాతి, మత, కుల భేదాలు ఎలా అడ్డురావో, జబ్బు గలవానికి మందు పుచ్చుకొనుటకు కులము అడ్డురాదో అలాగే ప్రతి వ్యక్తి భగవద్గీతను చదువవచ్చు, పూజించవచ్చు, ఆచరించవచ్చు అను విషయాలను లక్షలాది మందిని ఆకర్షించి, వివరించి, విశదపరిచింది.

గురుదేవులే. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారు గీతామకరంద స్వామి అని పిలచేవారు. పుట్టపర్తిలో పలు కార్యక్రమాలకు శ్రీ స్వామివారిని ఆహ్వానించి యున్నారు. శ్రీ స్వామి వారి ప్రవచనములను మహమ్మదీయులు, క్రైస్తవులు, నాస్తికులు కూడ విని ఆనందించేవారు. అశాంతితో బాధపడేవారు ఎందరెందరో శ్రీ స్వామి గీతా ప్రవచనముల విని శాంతి పొంది ఆనందంగ జీవితాన్ని గడిపినవారున్నారు.

శ్రీస్వాములవారు : ఏప్రిల్ 13న గీతా ప్రచారమునకై భగవంతునిచే ఈ లోకానికి పంపబడినారు. వచ్చిన పని పూర్తి చేసుకొని ఏప్రిల్ 10న తిరిగి భగవంతుని వద్దకు చేరిపోయినారు.

ఏప్రిల్ నెలకు చాలా ప్రాముఖ్యత వుంది. శ్రీ సద్గురు మలయాళ స్వాములవారు అవతరించిన నెల ఏప్రిల్, శ్రీరామచంద్రమూర్తి అవతరించిన శ్రీరామ నవమి ఏప్రిల్. శ్రీ సద్గురు స్వామీ తమ ఆశీస్సులు అందరికి దండిగా, నిండుగ, మెండుగ ఉండాలని కోరుతూ జై శ్రీరామ వాసుదేవ.

వేదాన్త విజ్ఞాన శిక్షణా తరగతులు

శ్రీ సనాతన ఋషి విద్యాలయము (శ్రీ వసిష్ఠాశ్రమము)

1. ప్రధానాచార్యులు శ్రీ స్వస్వరూపానందగిరి స్వాములవారు

(న్యాయ, వేదాన్త, సర్వదర్శనాచార్యులు)

2). శ్రీ ప్రకాశానంద సరస్వతీ స్వాములవారు (స్వామి దయానంద సరస్వతి శిష్యులు)   శిక్షణ కాలము - 6 నెలలు

24-07-2021 నుండి 24-01-2022 వరకు

స్థలము : శ్రీ వసిష్ఠాశ్రమము, శ్రీనివాస మంగాపురం, తిరుపతి సమీపం, పిన్ : 516102

శిక్షణలో చేరే వారికి సూచనలు: 15 నుండి 35 సంవత్సరముల లోపు అవివాహితులకు, మరియు బ్రహ్మచారిణీ / బ్రహ్మచారులకు మరియు సన్న్యాసినీ / సన్న్యాసులకు అవకాశముండును. వీరికి భోజన, వసతి, వస్త్ర, విద్యాసాధనములు, సాధారణ వైద్య సౌకర్యములు సంస్థ తరఫున ఏర్పాటు చేయబడును.

* 35 సంవత్సరములు దాటిన వారు మరియు వానప్రస్థులు శిక్షణలో చేరదలచినచో 6 నెలలకు గాను రూ. 25,000/-లు మొదటనే కట్టి చేరవలసి యుండును. ఇట్టి వారికి భోజన, వసతి, విద్యాసాధనములు సంస్థ తరఫున ఏర్పాటు చేయబడును.

*శిక్షణలో చేరే వారికి తెలుగు, హిందీ, ఇంగ్లీషు మాధ్యమములో బోధన ఉండును.

*శిక్షణ పూర్తి చేసే సాధకులకు సంస్థ తరఫున ప్రమాణ పత్రములు ఇవ్వబడును.

వివరములకు : 9440486392, 9426009812, 9769261479

శ్వేతాశ్వతరోపనిషత్తు

శ్రీ శంకర భగవత్పాదులవారి సంబంధ భాష్యానువాదం

అనువాదకులు - ఆచార్య శంకరానందగిరి స్వాములవారు,

(గత సంచిక తరువాయి)

శం.భా. పూర్వపక్షం : నను "విద్యాం చా ఽ విద్యాం చ యస్తద్వేదోభయగ్ం సహ" (ఈశ.ఉ.) "తపో విద్యా చ విప్రస్య నిఃశ్రేయసకరంపరం" ఇత్యాదినా కర్మణామపి అమృతత్వ ప్రాప్తి హేతుత్వమవగమ్యతే.

అనువాదం : ఈశావాస్యోపనిషత్తులో 'విద్యా (జ్ఞానం), అవిద్యా (కర్మ) ఈ రెంటిని వేరువేరుగా తెలిసికున్నవాడు, తపస్సు, జ్ఞానం ఈ రెండు సాధకునికి ఉత్కృష్ట సాధనలు? ఈలాంటి వాక్యాలు కర్మలు గూడ అమృతత్వప్రాప్తికి సాధనలని సూచిస్తున్నాయి గదా!

శం.భా. సమాధానం - సత్యం. అవగమ్యత ఏవ. తదపేక్షిత శుద్ధిద్వారేణ న చ సాక్షాత్. తథా హి "విద్యాం చా ఽ విద్యాం చ (ఈశ.ఉ-11) "తపో విద్యా చ విప్రస్య నిఃశ్రేయసకరం పరమ్." ఇత్యాదినా జ్ఞానకర్మణోర్నిః శ్రేయసహేతుత్వమభిధాయ కథమనయోస్తద్ధేతుత్వమిత్యా కాంక్షాయాం "తపసా కిల్బిషం హన్తి విద్యయా ఽ మృతమశ్నుతే." "అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా ఽ మృతమశ్నుతే" ఇతి వాక్యశేషేణ కర్మణః కల్మషహేతుత్వం విద్యాయా అమృత ప్రాప్తిహేతుత్వం ప్రదర్శితమ్. యత్ర తు శుద్ధ్యాద్యవాన్తర కార్యానుపదేశస్తత్రా ఽ పి శాఖాన్తరోపసంహార న్యాయేనోపసంహారః కర్తవ్యః."

అనువాదం - మీరు చెప్పేది సత్యమే. కాని జ్ఞానం కొరకు కావల్సిన చిత్త శుద్ధి ద్వారానే కర్మలు అమృతత్త్వప్రాప్తిలో కారణం. సాక్షాత్కారణం కాదు. అందువలననే 'విద్యాం చాఽవిద్యాం చ' 'తపో విద్యా చ విప్రస్య

నిఃశ్రేయసకరం పరం' అను వాక్యాల ద్వారా జ్ఞాన కర్మలను నిఃశ్రేయస్సులో కారణాలని ప్రకటించి ఎలా ఇవి కారణాలను జిజ్ఞాసకు 'తపసా కిల్బిషం హన్తి' 'విద్యయా ఽమృతమశ్నుతే' అని జ్ఞానకర్మలకు వేరు వేరు ఫలాలు సూచించబడినవి. కర్మలకు పాపదోషం పోయేదాంట్లో కారణత్వం, అమృతత్వ ప్రాప్తిలో జ్ఞానం కారణమని చెప్పబడింది. ఇంకా ఎక్కడైనా శుద్ధికి సంబంధించిన అన్యకర్మల సూచకత్వం కనుపించకపోయినప్పటికీ "శాఖాన్తరోప సంహారన్యాయం"తో కర్మలను సంగ్రహించవలసి వుంటుంది.

శం.భా. పూర్వపక్షం - నను "కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః" (ఈ.శ.-2) ఇతి యావజ్జీవకర్మానుష్ఠాననియమే సతి కథం విద్యాయా మోక్షసాధనత్వమ్?

అనువాదం - 'కర్మలు చేస్తూనే వంద సంవత్సరాలు జీవించేదానికి ఇచ్ఛగించు' అని జీవిత పర్యంతం కర్మానుష్ఠాన నియమం సూచింపబడినందున జ్ఞానం మోక్షసాధనమని ఎలా స్వీకరింపబడుతుంది?

అనువాదం - దీనికి సమాధానం చెప్పబడుతుంది- మీరు చెప్పిన నియమం కర్మలయందు అధికారం గలవారికి మాత్రమే. కాని కర్మాధికారానికి, శాస్త్రాజ్ఞకు బయటగల బ్రహ్మవేత్తలకు కాదు. ఈ విషయాన్నే శ్రుతి గూడ బ్రహ్మవేత్త కర్మాధికారానికి దూరుడని చెప్తుంది. 'బ్రహ్మవేత్త ఋషుల ఆజ్ఞాధీనుడు కాడు. ఇతను శాస్త్రానుయాయి అయి శాస్త్రాజ్ఞతో తన సాధనలను నిలిపివేయడు.' 'అందువలననే పూర్వవర్తి విద్వాంసులు అగ్నిహోత్రాది కర్మలను చేయలేదు'. 'ఆత్మతత్వాన్ని బొందినవారు పుత్రైషణా, విత్తైషణా లోకైషణలను విడిచినవారై భిక్షాచరణ చేయుచుండిరి'. 'బ్రహ్మవేత్తలగు కావషేయ ఋషులు గూడ ఈ విషయాన్నే ధ్రువీకరించారు. మేము ఏ ప్రయోజనం కొరకు అధ్యయనం చేయాలి? ఏ లక్ష్యపూర్తికొరకు

యజ్ఞం చేయాలి? ఏవిధంగా బ్రహ్మనిష్ఠుడు కాగలుగుతాడు. ఏరకంగానైనా (సర్వత్యాగి) కావచ్చు. శ్రీ మద్భగవద్గీతలో భగవంతుని మాట--'ఆత్మరతి, ఆత్మతృప్తి, ఆత్మయందే సంతుష్టిగల మానవునికి వేరే చేయవల్సిన కర్మతో పనిలేదు. అలాంటి బ్రహ్మనిష్ఠునికి ఈ లోకంలో కర్మ చేసినందున ప్రయోజనం లేదు. కర్మ చేయనందున ప్రత్యవాయదోషమూ లేదు. సమస్త భూతాలతో ఏ ప్రయోజనాన్ని పొందవల్సిన అగత్యమూ లేదు.' ఇతరుల సహకారం అతనికి అవసరమే లేదని భావం.

అనువాదం -లింగపురాణం కాలకూటోపాఖ్యానంలో పరమేశ్వరుడు ఈ విధంగా చెప్పాడు - 'ఓ విప్రోత్తములారా! జ్ఞానం ద్వారా నిస్సంగులైన జీవులు కర్తవ్యకర్మలను చేయరు. ఒకవేళ వారికి కర్తవ్యకర్మలంటూ వుంటే వారు తత్త్వవేత్తలు కారు. వారికి ఇహపరలోకాల్లో కర్తవ్య కర్మలుండవు. వాస్తవంగా బ్రహ్మవేత్తలు జీవించి వుండగానే ముక్తులైనారు. పరమార్థతత్వాన్ని తెలిసినవారు జ్ఞానాభ్యాస తత్పరులైన విరక్తపురుషులు కర్తవ్య చింతను విడిచి కేవలం జ్ఞానాన్నే పొందుతారు. ఓ ద్విజోత్తములారా! వర్ణాశ్రమాభిమానులైనవారు జ్ఞాన దృష్టిని వదలి మోహవశమున వేరే దాంట్లో సుఖముందని భావిస్తారు. అలాంటివారు అజ్ఞానులే. ఇందులో సందేహం లేదు. క్రోధం, భయం, లోభం, మోహం, భేదదృష్టి, మదం, అజ్ఞానం, ధర్మాధర్మాలు ఇవన్నీ అజ్ఞానులనే ఆశ్రయిస్తాయి. వారు వీటికి అధీనులయినందున మాటిమాటికి శరీరాలను ధరించవల్సి వుంటుంది. శరీరమున్నంతవరకు దుఃఖాలను తప్పనిసరి అనుభవించాలి. అందువలన జీవుడు అజ్ఞానాన్ని వదలాలి. జ్ఞానం ద్వారా అజ్ఞానాన్ని వదలినవారికి క్రోధాది దోషాలు, ధర్మా ఽధర్మాలన్నీ ఈ లోకంలో వుండగానే నశిస్తాయి. ఇవన్నీ నశించినందువలన తిరిగి వారికి శరీరంతో సంబంధం వుండదు. అలాంటి వారే త్రివిధతాపాల నుండి విడివడి ముక్తులవుతారు.'

మూలం: **ఉద్ధవ గీత** అనువాదం:

శ్రీ వ్యాసమహర్షి యేలేశ్వరపు హనుమరామకృష్ణ

(గత సెప్టెంబర్ సంచిక తరువాయి)

ఓ ఉద్ధవా ! ఈవిధంగా మన కర్మయోగాధికారి, భక్తియోగాధికారి, జ్ఞాన యోగాధికారుల గురించి చెప్పుకుంటున్నాం గదా! అయితే ఈ ముగ్గురికి గురువు, తల్లి కూడా వేదమాతయే!

ఈ త్రివిధ సాధకులు సద్గుణులు, ఏకాగ్రచిత్తులు అవ్వాలనునదే వేదహృదయం. ఒకనికి కర్మ, భక్తి, జ్ఞాన అధికారమును అనుసరించి ప్రయత్నములచే ఏర్పడే ఏకాగ్రతనే సగుణము అనే పేరుతో పిలుస్తున్నారు. గుణములవలన కొంచెము దోషముకూడా ఉంటుందని అనుకొన్నాం కదా! అటువంటి గుణదోష విధానముల వలన కలిగే సాంగత్యమును ప్రాయశ్చిత్త విధానాలచే పరిహరించుకొంటూ ఉండాలి కూడా. ఎందుకంటే కర్మలు సహజంగా చూస్తే కొంత దోషభూయిష్టంగానే ఉంటాయి. అశుద్ధత కొంత ఉంటుంది.

శ్లో ॥ స్వే స్వే అధికారే యా నిష్ఠా సగుణః పరికీర్తితః ।

కర్మణాం జాతి అశుద్ధానాం అనేన నియమః కృతః ।

గుణదోష విధానేన సంగానాం త్యాజనేచ్ఛయా ॥ (అధ్యా-20,శ్లో- 26) అని పెద్దలు చెప్పుచున్న విషయమే కదా. కర్మలు అనర్థములకు మూలములని కూడ చెప్పబడుతోంది. అందుచేత కొంత కొంత దృశ్య వ్యవహారములందు ప్రకృతిని సంకోచింప చేసుకుంటూ ఉండాలి కూడా." అనేది ఏమరువరాదు.

అందుచే ఉద్ధవా! "కర్మ విశేషములందు ఉద్విగ్నుడు అయిన వానికి ఆ విషయసమూహములన్నీ దుఃఖాత్మకములవుతాయని గమనించండి" అని నా లీలా విశేష కథల ద్వారా గుర్తు చేస్తూనే వున్నాను. ఒకవేళ విషయ సమూహములను విడువలేకపోతూ ఉంటే "నా యందలి భక్తి ప్రభావంచేత విషయ వాసనలు తొలుగుతాయి" అని కూడా నా లీలలచే బోధిస్తూ వస్తున్నాను. భక్తి ప్రభావంచేత కర్మలకు సంబంధించిన దోషములు తమకు తామే తప్పక తొలగుతాయి. క్రమంగా భక్తియొక్క విశిష్టతచేత దుఃఖ పరిణామములగు విషయములు అనివార్యంగా అనుభవిస్తూ ఉండవలసి వస్తున్నప్పటికీ వాటియందు ప్రీతి కలిగి ఉండకుండెదవుగాక ! సర్వాత్మకుడగు పరమాత్మయే నీకు ప్రీతిపాత్రమగు గాక! అట్టి భావన స్వభావసిద్ధంగా భక్తిచే పెంపొందగలదు. అద్దానివలన హృదయంలో ఉండే విషయవాసనలన్నీ వినష్టమౌతాయి.

శ్లో ॥ భిద్యతే హృదయ గ్రంధిః ఛిద్యన్తే సర్వ సంశయాః ।

క్షీయన్తేచాస్య కర్మాణి మయిదృష్టే అఖిలాత్మని (అధ్యా 20, శ్లో 30)

సర్వాంతర్యామి పరమాత్మ స్వరూపుడగు నన్ను సాక్షాత్కరింపజేసుకునే ప్రయత్నంలో ఉంటూ ఉండగా-

ఈ జీవుని యొక్క జీవాహంకారము స్వయముగా వినష్టమౌతూ వస్తుంది. హృదయంలో తిష్ఠ వేసుకొని యున్న సర్వ సంశయాలు తొలగుతూ వస్తాయి. ఛిన్నమైపోతూ ఉంటాయి.

సర్వ కర్మబంధాలు - కర్మరాశికూడా క్షయంఅవుతూవస్తుంది. పరమాత్మ పట్ల ప్రియము -ఇష్టము... ఇదే భక్తి. ప్రాపంచిక విషయముల పట్ల ఇష్టము - ప్రియమే సంసారము. ఎవరి చిత్తమైతే నాపట్ల ఏకాగ్రమౌతూ -భక్తి పారవశ్యమౌతూ వస్తోందో (ఇష్టము అధికమవుతూ ఉంటుందో)... అట్టివానికి జ్ఞాన-వైరాగ్యములు స్వభావసిద్ధమగుచూ, భక్తియే సర్వమునకు సాధనాసంపత్తిగా అగుచున్నది. జ్ఞాన-వైరాగ్యములు స్వభావమే అవుతాయి.

అంతేకాదు! కర్మ-తపస్సు-జ్ఞానము- వైరాగ్యము- యోగాభ్యాసము- తీర్థయాత్రలు-వ్రతములు మొదలైన ఆయా సాధనలచే లభించగలదానిని సర్వదేవతా స్వరూపుడనగు నాయొక్క భక్తుడు భక్తి యోగముచే అనాయాసముగా పొందుచున్నాడయ్యా! ఒకవేళ నా భక్తుడు ఎప్పుడైనా స్వర్గమో-మోక్షమో-వైకుంఠధామమో కోరుకుంటాడనుకో...! అవన్నీ భక్తునికి అనాయాసంగా లభించగలవని చేతులెత్తి ప్రకటిస్తున్నాను.

చమత్కారం ఏమిటో గమనిస్తున్నావా?

సర్వాంతర్యామి అయిన నాపట్ల భక్తిని పెంపొందించుకొన్నవారు "భక్తికి ఫలితంగా భక్తియే మాకుచాలు! మాకు ఇంకేమీ అక్కర్లేదు.." అని నిర్ణయించుకొని ఉంటున్నారు. భక్త్యానందమునకు సాటి ఏది? "నాయనా! నీకు మోక్షము ప్రసాదిస్తాను"... అని నేను ముందుకు వచ్చినా కూడా "సర్వతత్త్వ స్వరూపుడవగు నీపట్ల మాకు సర్వదా ఇష్టరూపమైన భక్తి ఉంటే చాలయ్యా..." అని ఎలుగెత్తి సమాధానం చెప్పుచున్నారు.

స్వప్నసదృశమైనట్టి లోక సంఘటన -సందర్భములపట్ల అపేక్షయే బంధము. నిరపేక్షయే సర్వోత్కృష్టము. అత్యధికవంతము. సకల శ్రేయోప్రసాదకము. నిరపేక్షత - నిష్కామము ఎక్కడ ఉంటాయో... అక్కడ నా పట్ల భక్తి అవిచ్ఛిన్నంగా వికాసమానమౌతూనే వుంటుంది. భక్తియొక్క ప్రభావంచేత రాగము స్వయంగా తొలగుతుంది. రహితమౌతుంది. భక్తియొక్క ప్రభావంచేత మాయాతీత భగవత్ వస్తువును స్వయముగా పొందుచున్నారు. అట్టి భక్తుని విధి-నిషేధములకు సంబంధించిన పుణ్యపాపములు తాకజాలవు. శాస్త్రములు కూడా అతని పట్ల ఎట్టి విధి-నిషేధములు విధించవు. "బాగా చదువుకుంటున్న బాలునికి బాగా చదవటానికి ఏఏ జాగ్రత్తలు కావాలి"...అని నియమాలు చెప్పం కదా! ఇదీ అంతే!

నేను చెప్పిన ఈ కర్మ-జ్ఞాన-భక్తి మార్గములను ఆచరిస్తూ వస్తున్నవారు... అట్టి జ్ఞానభక్తియొక్క ప్రభావముచేత కాలము- మాయలచే స్పృశించబడనట్టి వైకుంఠధామము పొందుచున్నారు. పరబ్రహ్మతత్త్వమును ఎరిగినవారై బ్రహ్మమే తామై వెలుగొందుచున్నారు.

వార్తలు

(01). 27-02-2021వ తేది మాఘపూర్ణిమ శనివారం శ్రీ శుక బ్రహ్మాశ్రమంలో గురుపాదుకలకు పూజ జరిగినది. ఉదయం 10 గంటల నుండి లోక కళ్యాణార్థము మృత్యుంజయ హోమము, ఆయుష్య హోమము, నవగ్రహ హోమాదులు జరిగినవి. పూర్ణాహుత్యనంతరం అన్న సంతర్పణ చేయబడినది. శ్రీకాళహస్తి పుర ప్రముఖులు, ఆశ్రమ భక్తులు ఇందులో పాల్గొనినారు.

(02). 11-03-2021వ తేది మాఘబహుళ చతుర్దశి గురువారం మహాశివరాత్రి సందర్భంగా ఉదయం ఆశ్రమంలోని శివాలయంలో అర్చన, స్తోత్రపారాయణలు, నామ సంకీర్తనలు జరిగాయి. రాత్రి ఆశ్రమ శివాలయంలోని నర్మదేశ్వర మహాదేవునకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చన చేయబడినవి. భక్తులందరూ అభిషేకాలు, బిల్వార్చన స్వయంగా చేశారు. తీర్థ ప్రసాదాలు అందరికి అందజేయబడినవి.

(03). 18-03-2021వ తేది గురువారం కృత్తిక సందర్భంగా ఆశ్రమ శివాలయంలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి ప్రదోషకాలంలో అభిషేకం, అర్చన చేయబడినవి.

(04). 28-03-2021వ తేది ఆదివారం ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో గురుపాదుకలకు పూజ చేసి, గిరిజన కాలనీలో అన్నదానం చేయబడును.

(05). ఆశ్రమ భక్త కన్నప్ప కంటి ఆసుపత్రిలో 2021 ఫిబ్రవరి నెలలో ఓ.పి.లో **712 మందికి** కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. సర్జరీ విభాగంలో **79 మందికి** కంటి పొరలు తీసి కళ్ళలో లెన్సు అమర్చబడినవి.

27-02-2021 మాఘపౌర్ణమి (మహామాఘి) నాడు ఆశ్రమంలో

భక్తులకు అన్నదానం

Regd.No. TRP / 123 / 2021 - 23 April 2021 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-03-2021, Permitted to post : 29th, 30th every month.

11-03-2021న ఆశ్రమంలో మహాశివరాత్రినాడు
సర్వేశ్వర మహాదేవ శివలింగం

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం